అంతర్రాష్ట్ర రహదారులకు 'అటవీ' గ్రహణం

- అభ్యంతరాలతో ఆగిన పలు రహదారులు
- ఈ రహదారులు పూర్తయితే స్థానికులకు ప్రయోజనం
- సమస్యను పరిష్కరించాలంటున్న నియోజకవర్గ ప్రజలు


బైరెడ్డిపల్లె మండలంలో ఆగిన పేర్నంబట్ అంతర్రాష్ట్ర రహదారి


పలమనేరు నుంచి చెత్తపెంట మీదుగా అరట్లకు వెళ్లే రహదారి

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని పలు అంతర్రాష్ట్ర రహదారులు, గ్రామాల రహదారుల పనులు కొన్నేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. అటవీశాఖ అభ్యంతరాలతో వీటికి గ్రహణం పట్టింది. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఎంతో మేలు కలగనుంది. ఈ రోడ్ల నిర్మాణం కోసం విడుదలవుతున్న నిధులు సైతం వెనక్కి మెరలుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు పనుల కోసం తీవ్రంగా కృషి చేసినా ఫలితం దక్కలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వమైనా ఈ పనులకు పూనుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

బైరెడ్డిపల్లె–పేర్నంబట్ రోడ్డు

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె నుంచి కడప సత్తం మీదుగా పేర్నంబట్‌కు రహదారి ఉంది. కేవలం 22 కి.మీల దూరమే ఇది. అయితే పేర్నంబట్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం వి.కోట నుంచి లేదా పలమనేరు నుంచి 60 కి.మీ చుట్టుతిరిగి వెళ్లాల్సి వస్తోంది. అదే ఈ పనులు పూర్తయితే కేవలం అరగంటలో పేర్నంబట్‌కు చేరుకోవచ్చు. బైరెడ్డిపల్లె నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు ఇప్పటికే తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది. మరోవైపు పేర్నంబట్ నుంచి తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు పక్కా రోడ్డు నిర్మించింది. అయితే కౌండిన్య అటవీ ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర రహదారి పనులకు అటవీశాఖ నుంచి మన ప్రభుత్వానికి అనుమతులు లభించలేదు. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించేందుకు రోడ్డు లేకుండా పోయింది. గతంలో ఆ మండల వైఎస్సార్‌సీపీ నేతలు కొంత వరకు మండల నిధులతో రోడ్డు పనులు చేసినా అటవీశాఖ అభ్యంతరాలతో పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి.

నెల్లిపట్ల, అరట్ల రోడ్డు పరిస్థితీ ఇదే!

పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె నుంచి బైరెడ్డిపల్లె మండలంలోని నెల్లిపట్ల మీదుగా తమిళనాడు రాష్ట్రంలోని అరట్లకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పనులు నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికే మన రాష్ట్రంలోని నెల్లిపట్ల నుంచి అటవీమార్గంలో తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు వేశారు. తమిళనాడు ప్రభుత్వం వారి సరిహద్దు వరకు తారు రోడ్డు వేసింది. అయితే 4 కిలోమీటర్ల మేర మనరాష్ట్రంలో రోడ్డు పనులు ఆగిపోయాయి. అటవీశాఖ అభ్యంతరాలు తెలపడంతో ఈ పనులు ఆరేళ్ల నుంచి కొండెక్కాయి. దీంతో ఇరు రాష్ట్రాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా వినియోగించుకోలేని దుస్థితి ప్రాప్తించింది.

చెత్తపెంట–తమిళనాడు సరిహద్దు

పలమనేరు మండలంలోని చెత్తపెంట నుంచి బాపలనత్తం, నెల్లిపట్ల మీదుగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు పనులకు అటవీశాఖే ఇబ్బందిగా మారింది. కనీసం పలమనేరు మండలం నుంచి బైరెడ్డిపల్లె మండలానికి సైతం రోడ్డు ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు నో చెప్పారు. 2005–06 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో రూ.2.5 కోట్లు మంజూరైంది. పలమనేరు మండలంలోని పెంగరగుంట క్రాస్ నుంచి తారు రోడ్డు పనులు చెత్తపెంట సరిహద్దు వరకు పూర్తయ్యాయి. అయితే బాపలనత్తం వద్ద అటవీ ప్రాంతంలో అభ్యంతరాల కారణంగా ఈ పనులు ఆగిపోయాయి. దీంతో నిధులు మురిగిపోయాయి.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?

పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల నుంచి తమిళనాడు రాష్ట్రంలోకి దగ్గరి రహదారులున్నాయి. అయితే ఈ రెండు రాష్ట్రాలకు మధ్య దట్టమైన కౌండిన్య అటవీప్రాంతం ఉంది. కేవలం అటవీశాఖ అభ్యంతరాల కారణంగా రెండు రాష్ట్రాల మధ్య రవాణ సౌకర్యం లేకుండా పోతోంది. ఈ పనులు పూర్తయితే ఇరు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు పెరిగి ఈ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇక మండలంలోని జగమర్ల–తుంబపాళ్యం రోడ్డు పనులు చేస్తే జగమర్ల, యానాది కాలనీ, గంగవరం మండలంలోని కొత్తపల్లె, కీలపట్ల, పంజాణి మండలంలోని పెద్ద ఉప్పరపల్లె తదితర మారుమూల పల్లెలు అభివృద్ధి చెందుతాయి. ఇక్కడ గిరిజనులు పండించే మామిడి, పాలు మొదలైనవి రవాణా చేసేందుకు వీలవుతుంది. ఇక పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. బెంగళూరు నుంచి తిరుపతికి సైతం ఈ మార్గం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఇకనైనా ఈ రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

పలమనేరు–తుంబపాళ్యం రోడ్డు

పలమనేరు నుంచి జగమర్ల మీదుగా తుంబపాళ్యంకు రోడ్డు పనులకు అటవీశాఖతోనే ఇబ్బందులు. ఈ రోడ్డు పనులు అదిగో ఇదిగో అంటున్నారేగానీ పనులు మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. పలమనేరు నుంచి గాంధీనగర్ మీదుగా జగమర్ల వరకు మట్టిరోడ్డు వుంది. దీనిని ఈ మధ్యనే దేవళంపేట వరకు పొడిగించారు. ఈ మార్గంలో తారు రోడ్డు వేసేందుకు ఆర్‌అండ్‌బీ ముందుకొచ్చినా అటవీశాఖ అనుమతులు లేక ఈ పనుల ఊసే లేకుండా పోయింది.


జగమర్ల నుంచి తుంబపాలెం వెళ్లే రోడ్డు

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు

పుంగనూరు: బక్రీద్ పండుగ పురస్కరించుకుని ఎన్ఎస్ పేట ఈద్గా మైదానంలో ఆదివారం పారిశుధ్యం మెరుగు పరిచారు. కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, సిబ్బందితో కలసి అవసరమైన పనులు చేశారు. షామియానాలు వేయించడంతోపాటు మంచినీటి వసతి కల్పించారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు సెంటర్‌లాడ్జి నుంచి ముస్లింలు ర్యాలీగా బయలుదేరి 8 గంటలకు ఈద్గాలో ప్రార్థనలు చేయనున్నట్లు సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ తెలిపారు.

వైభవంగా గంగజాతర


ధర్మపురిలో విశేష అలంకరణలో గంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల, ధర్మపురి గ్రామాల్లో గంగజాతరను వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామ పొలిమేరల్లో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. ఇతర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

గంగజాతర రేపు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో మంగళవారం గంగజాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అంబలి, సాయంత్రం పొంగళ్లను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించిన తరువాత గ్రామ నడివీధిలో కొలువుదీర్చనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

భాషా పురస్కారాలకు ఆహ్వానం

పలమనేరు: తెలుగుభాషకు సేవ చేస్తున్న వారికి కళామందిరం రెండో వార్షికోత్సవం సందర్భంగా జూలై 7న వార్షికోత్సవ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై ఆసక్తి ఉన్న వారు ఈనెల 30 లోపు తులసీనాథం నాయుడు, సాయిగార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు అనే చిరునామాకు తమ వివరాలను పోస్టు ద్వారా పంపాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవోలు

పలమనేరు: స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డిని ఏపీ ఎన్జీవోలు ఆదివారం ఆయన నివాసంలో సన్మానించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎలాంటి ఒత్తిళ్లకు గురి చేయకుండా పాలన సాగిస్తే మంచిదని, ఎప్పటికప్పుడు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు ఆనంద్‌బాబు, జయమ్మ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రామకోటి


బిల్లేరులో నిర్వహిస్తున్న రామకోటి

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ బిల్లేరు సమీపంలోని శ్రీ రామాలయంలో ఆదివారం రామకోటి గీతాలాపన ప్రారంభించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో రామాలయంలో సీతా రామలక్ష్మణ హనుమాన్ విగ్రహాలకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి చెక్కును అందజేస్తున్న డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని పీఎం తండాకు చెందిన రైతు కన్నా నాయక్ ఒంటరి ఏనుగు దాడిలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక టీడీపీ నేతల ద్వారా మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రేంజర్ జయశంకర్, స్థానిక టీడీపీ నేతలు గంట్లప్పగౌడు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజీనామా

సదుం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్టు ఆదివారం తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్‌కు అందజేసినట్టు తెలిపారు. తన నియామకం జరిగినప్పటి నుంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేశానని పేర్కొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ నేత మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

పలమనేరు: పలమనేరు ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన అంత్యక్రియలు సోమవారం గుడిపాల మండలంలోని మంది క్రిష్ణాపురంలో నిర్వహించనున్నట్టు సభ్యులు తెలిపారు. ఆయన మృతి అసోసియేషన్‌కు తీరని లోటని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న నెల్లూరు వాసులు


కాణిపాకం: నెల్లూరు జిల్లాకు చెందిన నరేందర్ రెడ్డి ఆదివారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానానికి రూ.1,00,116లను విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాత, కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం పలికారు. సిబ్బంది వాసు, విఘ్నేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు


శాంతిపురం: రోడ్డు ప్రమాదంలో కన్నబిడ్డను కోల్పోయిన కుటుంబాన్ని ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప పరామర్శించారు. మైసూరు–బెంగళూరు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దన్న కుమారుడు విశ్వనాథ్(21) శనివారం మృతి చెందాడు. మఠం పంచాయతీలోని వెంకటేశపురంలో ఆదివారం జరిగిన అంత్యక్రియలలో పలువురు నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోనులో మృతుడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఎమ్మెల్సీ, మాజీ ఎంపీతోపాటు కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, ఏపీఎఫ్‌డీసీ డైరెక్టర్ కృష్ణమూర్తి తదితరులు నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు.

రామసముద్రం రహదారికి మోక్షమెప్పుడో..?


కైగల్ నుంచి రామసముద్రంకు వెళ్లే రహదారి

బైరెడ్డిపల్లె: పాలకులు మారుతున్నా రామసముద్రం రహదారికి మోక్షం లభించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. 2017లో అప్పటి మంత్రి అమరనాథరెడ్డి పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని కైగల్ నుంచి రామసముద్రం వరకు సుమారు 5 కిలోమీటర్ల దూరం రహదారి వేయడానికి శ్రీకారం చుట్టారు. రహదారి చదును చేసి కంకర వేసి పనులు ప్రారంభించారు. దీంతో కై గల్, ఎం.కొత్తూరు, సన్నిపల్లె, మునిపల్లె, రామసముద్రం, దాసార్లపల్లె గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రహదారికి విడుదల చేసిన నిధులు కూడా కాంట్రాక్టర్లు బిల్లుల రూపంలో పొందారు. అయితే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో అమరనాథరెడ్డి రహదారి పనులు నిలిపివేయించారు. అప్పటి నుంచి కంకర రహదారిపైనే ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఏడేళ్లుగా అగచాట్లు పడుతున్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తుల్ని మార్కెట్లకు తరలించాలన్నా నానా అవస్థలు పడుతున్నారు. రహదారి దుస్థితికి ఏ ఒక్క ఆటో కూడా రాని పరిస్థితి ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డి పోటీ చేసి గెలుపొందడంతో రహదారికి ఇకనైనా మోక్షం వస్తుందా, లేదా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అలరించిన 'దుర్యోధన వధ'


భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా గానం చేశారు. ఆ తర్వాత దుర్యోధన వధ ఘట్ట ప్రదర్శన భక్తులను అలరించింది. మహాభారతంలో గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీమసేనుడు వెలికి రప్పించి వధించడం విదితమే. ఈ ఘట్టాన్ని కళాకారులు తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. దుర్యోధన పాత్రధారి సత్యరాజ్ తన నటనతో పలువురిని కంటతడి పెట్టించారు. భీమ, దుర్యోధనుల రోషావేశాలతో కలియబడుతూ, పద్యాలు ఆలపిస్తూ, చేసిన యుద్ధం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి, తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత, ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్‌నాయుడు, కుప్పయ్య, నారాయణస్వామి నాయుడు, మాధవనాయుడు, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్న తోతాపురి ధర

- టన్ను రూ.28 వేల నుంచి 22 వేలకు పడిపోయిన ధర


మార్కెట్‌లో తోతాపురి కాయలు

బంగారుపాళెం: స్థానిక మామిడి మార్కెట్‌లో తోతాపురి (బెంగళూర)రకం మామిడి ధరలు రోజురోజుకు పతనం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ ప్రారంభంలో తోతాపురి రకం ధర ఆశాజనకంగా ఉండేది. టన్ను రూ.28 వేల వరకు పలికింది. ప్రస్తుతం టన్ను రూ.22 వేల రూపాయలకు పడిపోయింది. ప్రారంభ ధరతో పోల్చుకుంటే టన్నుకు రూ.6 వేలు నష్టపోతున్నారు. ఫ్యాక్టరీకి తరలించే కాయలు టన్ను రూ 25 వేల వరకు పలుకుతోంది. మామిడి రైతులు ప్రతి సంవత్సరం నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. దిగుబడి బాగుంటే, గిట్టుబాటు ధరలేక నష్టపోవడం, ధర ఆశాజనకంగా ఉంటే పంట దిగుబడిలేకపోవడం వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఈ సంవత్సరం తోటల్లో పూత సకాలంలో రాకపోవడంతో పాటు ఆలస్యంగా వచ్చిన పూత సైతం రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు మూడు టన్నులు వరకు దిగుబడి రావాల్సి ఉండగా ఇప్పుడు టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదని మామిడి రైతులు వాపోతున్నారు.. నైరుతి రుతుపవనాల కారణంగా పెనుగాలులతో కూడిన వర్షం అడపాదడపా పడుతుండడంతో ఉన్న కాయలు నేలరాలిపోతున్నాయి. రానున్న రోజుల్లో ధర పెరుగుతుందనే ఆశాభావంతో ఉన్నారు.

అ'పూర్వ' కలయిక

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో 1992–93లో వారంతా పదో తరగతి చదివారు. కాలక్రమంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మూడు దశాబ్దాల అనంతరం వారంతా మళ్లీ కలిశారు. జ్ఞాపకాల పూదోటలో సందడి చేశారు. ఆదివారం స్థానికంగా ఒక కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ, చిన్ననాటి నిక్ నేమ్స్‌తో పలకరించుకుంటూ ఆనందడోలికల్లో మునిగారు. మొత్తం రెండు సెక్షన్లలో కలిపి అప్పట్లో 102మంది టెన్త్ చదివారు. వీరిలో 50మంది ఇప్పుడు ఇక్కడ కలిశారు. తొలుత తమ మిత్రుల్లో మరణించిన నాగరాజు, అగ్నిదేవర నాగరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఎవరెవరు ఏం చేస్తున్నారు, ఎక్కడ ఉన్నారో తెలుసుకున్నారు. ఇంకనూ మిగిలిన మిత్రుల ఎక్కడెక్కడ ఉన్నారో అన్వేషించే పనిలో పడ్డారు. అందరి వివరాలు సేకరించాక మరోసారి గెట్ టు గెదర్ నిర్వహించి తమ ఉన్నతికి బాటలు వేసి గురువులను సత్కరించాలని, అలాగే తాము చదువుకున్న హైస్కూలు అభివృద్ధికి తమవంతు తోడ్పాటు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీంతోపాటు పేద విద్యార్థులకు ఆర్థికంగా ప్రోత్సహించడంతోపాటు విద్యలో మంచి మార్కులు సాధించినవారికి నగదు ప్రోత్సాహకాలు సైతం ఇస్తామని తెలిపారు. తెలంగాణ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ చేస్తూ కొందరు, చిరు వ్యాపారులు చేస్తూ మరికొందరు, వ్యవసాయంపై ఆధారపడి ఇంకొందరు, ఉపాధ్యాయులుగా నలుగురు ఉన్నట్టు చెప్పారు. వచ్చిన పూర్వ విద్యార్థినుల్లో అందరూ గృహిణులే ఉన్నారు. ఇక తమ బ్యాచ్‌లో ఎవరైనా కష్టాల్లో ఉంటే అందరూ కలిసి ఆదుకోనున్నట్టు చెప్పారు.


31 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

ఘనంగా సుబ్రమణ్యస్వామి ఊరేగింపు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో ఆదివారం సుబ్రమణ్యస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. దుర్గాలమ్మ ఆలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం సుబ్రమణ్యస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం సుబ్రమణ్యస్వామిని బొమ్మసముద్రం గ్రామంలో ఊరేగించారు.


స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం
- పూర్తయిన ఏర్పాట్లు
- ముస్తాబైన మసీదులు


గిరింపేటలో ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా జరుపుకుంటారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ అజహా (బక్రీద్). దీన్నే త్యాగాల పండుగ అని కూడా పిలుస్తారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

పండుగ పరంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఒక గొర్రె, పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో దాన్ని బంధువులకు, మూడో భాగాన్ని తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేస్తారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళతారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్గాకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేస్తారు.

మార్కెట్‌లో సందడి

మార్కెట్‌లో బక్రీద్ సందడి మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు తమిళనాడు నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరి కొందరు తమ సమీప ప్రాంతాల నుంచి కొనుగోలు చేశారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.8 వేల నుంచి రూ.22 వేల వరకూ ధర పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. బక్రీద్ సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొట్టేళ్ల వ్యాపారం జరిగినట్టు అంచనా.

పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తుందంటే పొట్టేళ్లకు గిరాకీ పెరుగుతుంది. ముస్లింలు వారం రోజుల నుంచే కొత్త బట్టలు, పండగ సామగ్రి కొనుగోలు చేస్తారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారు. పండుగ తర్వాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చే అవకాశం ఉంది.

ముస్తాబైన మసీదులు, ఈద్గాలు

చిత్తూరులోని ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రార్థనకు ముస్లింలు అధిక సంఖ్యలో తరలివస్తారని భావించి ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. అలాగే బజారువీధి, శేషపిరాన్‌వీధి, హైరోడ్డు, రాంనగర్ కాలనీ, గంగనపల్లె తదితర ప్రాంతాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈద్గాలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభంకానున్నట్లు మత పెద్దలు తెలిపారు.